www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily | బుధవారం 2, సెప్టెంబర్, 2026

# మధ్యాహ్నం దాటితే.. మందులు కరువు!

**ప్రభుత్వాసుపత్రిలో మందుల కొరతతో రోగుల అవస్థలు.. బయట నుంచి కొనుగోలు చేయాల్సిన దుస్థితి**




చర్ల: సెప్టెంబర్ 1 భద్రాద్రి న్యూస్: చర్ల ప్రభుత్వాసుపత్రిలో మందుల కొరత రోగులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. ముఖ్యంగా మధ్యాహ్నం సమయం దాటిన తర్వాత ఆసుపత్రిలో అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడంతో రోగులు బయట మెడికల్ షాపులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాసుపత్రిలో వైద్యం కోసం వచ్చే పేద, సామాన్య ప్రజలకు ఉచితంగా మందులు అందాల్సి ఉండగా, మందులు అందుబాటులో లేకపోవడంతో వైద్యులు బయట నుంచి కొనుగోలు చేయాలని సూచిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## ఏకలవ్య పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

కుళ్లిన వంట సామగ్రిపై ఆగ్రహం.. క్యాటరింగ్ అసిస్టెంట్‌కు హెచ్చరిక

విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశం




భద్రాద్రి కొత్తగూడెం, (భద్రాద్రి న్యూస్ ): కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామవరం ప్రాంతంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్--పాల్వంచను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

## మున్నేరు నీరు తక్కువ.. ప్రత్యామ్నాయ నిమజ్జన స్థలాల పరిశీలన




వినాయక నిమజ్జనానికి అనువైన చెరువులపై పోలీస్ కమిషనర్ సునీల్ దత్ దృష్టి

భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు ప్రణాళిక: అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు

## కొత్తగూడెం విమానాశ్రయానికి రెక్కలు!

**సెప్టెంబరు 7న క్షేత్రస్థాయి పరిశీలనకు కేంద్ర సాంకేతిక బృందం**

**నాలుగైదు ప్రత్యామ్నాయ స్థలాలపై సమగ్ర అధ్యయనం.. నివేదిక అనుకూలిస్తే తదుపరి చర్యలు**







భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 1 (భద్రాద్రి న్యూస్):- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల దశాబ్దాల కల సాకారం దిశగా మరో కీలక ముందడుగు పడింది. జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియలో భాగంగా సెప్టెంబరు 7న కేంద్ర సాంకేతిక బృందం తెలంగాణలో పర్యటించనుంది. ఈ విషయమై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిసి చర్చించారు.

# మధ్యాహ్నం దాటితే.. మందులు కరువు!

**మొదటి పేజీ తరువాయి**

దీంతో ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులపై అదనపు భారం పడుతోంది. "ప్రభుత్వాసుపత్రికి వస్తే మందులు బయట కొనుక్కోవాల్సి వస్తోంది. ఉచిత వైద్యం, ఉచిత మందులు అందుతాయని ఆశించి వస్తున్న పేదలకు ఇదే పరిస్థితి ఎదురవుతోంది" అని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆసుపత్రిలో మందుల నిల్వలు, పంపిణీ విధానంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, రోగులకు అవసరమైన మందులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వాసుపత్రిలో మందుల కొరతకు అసలు కారణమేంటో అధికారులు వెల్లడించి, సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

# కొత్తగూడెం విమానాశ్రయానికి రెక్కలు!

**మొదటి పేజీ తరువాయి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు విమానాశ్రయం అవసరం, దాని ద్వారా కలిగే రవాణా, పారిశ్రామిక, పర్యాటక ప్రయోజనాలను కేంద్ర మంత్రికి వివరించారు. నాలుగైదు ప్రాంతాల పరిశీలన గతంలో గుర్తించిన రెండు ప్రాంతాలు సాంకేతిక కారణాలతో అనుకూలంగా లేవని తేలడంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నాలుగైదు ప్రత్యామ్నాయ ప్రాంతాలను గుర్తించినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. సెప్టెంబరు 7న వచ్చే కేంద్ర సాంకేతిక బృందం ఆయా ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించనుంది.

రన్‌వే నిర్మాణానికి భూభాగం అనుకూలత, భౌగోళిక పరిస్థితులు, వాతావరణం, భూసేకరణ సౌలభ్యం తదితర అంశాలపై నిపుణుల బృందం సమగ్రంగా అధ్యయనం చేయనుంది.

**నివేదిక అనుకూలిస్తే వెంటనే చర్యలు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్షను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. సాంకేతిక బృందం నివేదిక అనుకూలంగా వచ్చిన వెంటనే విమానాశ్రయం ఏర్పాటుకు తదుపరి చర్యలు చేపడతామని రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఉన్న ప్రాంతంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఉన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని కూడా మంత్రి తుమ్మల కేంద్ర మంత్రికి వివరించారు. తనకు రామ్మోహన్ నాయుడు తండ్రి, దివంగత నేత ఎర్రన్నాయుడుతో ఉన్న చిరకాల అనుబంధాన్ని సైతం గుర్తుచేశారు.

**మామునూరు, ఆదిలాబాద్‌పైనా చర్చలు**

రాష్ట్రంలోని ఇతర విమానాశ్రయ ప్రతిపాదనలపైనా కేంద్రంతో చర్చలు కొనసాగుతున్నాయని మంత్రి తుమ్మల తెలిపారు. మామునూరు (వరంగల్), ఆదిలాబాద్ విమానాశ్రయాల అంశంపై సెప్టెంబరు 2న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో చర్చించనున్నట్లు వెల్లడించారు.

కేంద్ర సాంకేతిక బృందం నివేదిక సానుకూలంగా వస్తే భద్రాద్రి కొత్తగూడెం గగనతలంలో విమానాలు ఎగరాలన్న జిల్లా ప్రజల చిరకాల స్వప్నం సాకారమయ్యే దిశగా వేగంగా అడుగులు పడే అవకాశం ఉంది.

# ఏకలవ్య పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





**మొదటి పేజీ తరువాయి**

పాఠశాల భవనాలు, పరిసరాలు, వంటగది, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్, ఆర్.ఓ.ఆర్. ప్లాంట్ తదితర ప్రాంతాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. 2017లో 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ పాఠశాలలో ప్రస్తుతం ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 480 మంది విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు వసతి సౌకర్యాలు పొందుతున్నారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలను ఇన్‌చార్జి మున్సిపల్ ప్రశంజీత్ భూసాల్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

**వంటగదిలో నాణ్యతపై ఆరా**

అనంతరం డైనింగ్ హాల్‌లోని వంటగదిని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల కోసం సిద్ధం చేసిన అన్నం, పప్పు, సాంబార్, రసం, పెరుగు, కోడిగుడ్లు తదితర ఆహార పదార్థాలను పరిశీలించారు. రాత్రి భోజనం కోసం సిద్ధం చేసిన కూరగాయలను కూడా పరిశీలించి వంట మనుషులు, హెల్పర్లతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, వంటగది, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పరిశుభ్రత పాటించడం ద్వారా విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.

**కుళ్లిన బెల్లంపై ఆగ్రహం**

స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ అక్కడ నిల్వ ఉన్న కూరగాయలు, ఉల్లిగడ్డలు, పప్పు దినుసులు, బియ్యం, సబ్బులు, షాంపూలు తదితర సామగ్రి వివరాలను క్యాటరింగ్ అసిస్టెంట్ మంగీలాల్ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిల్వ ఉంచిన బెల్లం కుళ్లిపోయి ఉండటాన్ని గమనించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సామగ్రిని సక్రమంగా నిల్వ చేయడంతో పాటు విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని క్యాటరింగ్ అసిస్టెంట్‌ను హెచ్చరించారు. పాఠశాల సిబ్బంది సైతం విధులను సక్రమంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.

**రోడ్లు, సెక్యూరిటీ రూమ్ సమస్యలు**

పాఠశాలలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న సుజాత తన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సెక్యూరిటీ రూమ్ లేక విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సెక్యూరిటీ రూమ్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా పాఠశాలకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, అంతర్గత రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం తహసిల్దార్ పుల్లయ్య, రెవెన్యూ సిబ్బంది బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# మున్నేరు నీరు తక్కువ.. ప్రత్యామ్నాయ నిమజ్జన స్థలాల పరిశీలన

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 1 (భద్రాద్రి న్యూస్):

ఖమ్మం నగరంలో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రత్యేక దృష్టి సారించారు. మున్నేరు నదిలో ప్రస్తుతం నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో నిమజ్జనానికి ప్రత్యామ్నాయంగా అనువైన చెరువులను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత పోలీస్ అధికారులు, సంభాద్రి ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి నిమజ్జనానికి అనువైన ప్రాంతాలను సందర్శించిన సీపీ అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఇందులో భాగంగా ఖమ్మం అర్బన్ మండలంలోని దంసలాపురం గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరు చెరువును సందర్శించి నిమజ్జన ఏర్పాట్లకు అనుకూలతను పరిశీలించారు. నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన భద్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై అధికారులతో చర్చించారు. విగ్రహాల తరలింపు, వాహనాల రాకపోకలు, పార్కింగ్, భక్తుల భద్రత తదితర అంశాలపై ముందస్తుగా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా జరిగేలా పోలీస్ శాఖ అన్ని చర్యలు చేపడుతుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, టౌన్ ఏసీపీ రమణమూర్తి, ఎస్బీ ఏసీపీ మహేష్, ఇన్‌స్పెక్టర్లు మోహన్ బాబు, భానుప్రకాష్, సంభాద్రి ఉత్సవ కమిటీ ప్రతినిధులు వినోద్ లాహుటి, విద్యాసాగర్ శ్రీహరి, ప్రసన్నకృష్ణ, సుధాకర్, యుగేందర్ శర్మ, సురేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# ఊకే శిరీష కు కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలి

**బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప రాంబాబు**

**వెంకటాపురం భద్రాద్రి న్యూస్ సెప్టెంబర్ 01,**




ఉన్నత విద్యను అభ్యసించి తమ కుటుంబాన్ని ఆదుకుంటుందని కలలు కన్న కన్నవారి ఆశలను ఓ కామాంధుడి కారణంగా ఆవిరై పోయాయంటూ, ఊకే శిరీష మరణానికి రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని వెంకటాపురం బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప రాంబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వెంకటాపురం వేదికగా విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన ఈ విధంగా ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్ర రాజధానిలో మహిళలకు రక్షణ లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెద్దేవ చేశారు. చేతకాని కాంగ్రెస్ పాలన కారణంగానే ఆదివాసీ బిడ్డ ఉయిక శిరీష లోకాన్ని విడిచి వెళ్లిందని కన్నీటి పర్యాంతం అయ్యారు. ఇలాంటి దౌర్భాగ్య పాలనలో ప్రజలకు కష్టాలు తప్పడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్న ఆదివాసి ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ఎమ్మెల్యేల రాజీనామానే ఊకే శిరీషకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే అని అన్నారు. శిరీష కుటుంబానికి వెంకటాపురం బిఆర్ఎస్ పార్టీ తరుపున ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# సగర సంఘం గుండ్లసింగారం కమిటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

సగర సంఘం గుండ్ల సింగారం కమిటీ ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వైద్యులు మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 150 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా శస్త్ర చికిత్స అవసరమున్నవారికి రెఫర్ చేశారు. ఈ సందర్భంగా గుండ్లసింగారం సగర సంఘం అధ్యక్షుడు కొడిపాక రాజయ్య మాట్లాడుతూ సగర సంఘం సభ్యుల సంక్షేమానికి పాటుపడతామని చెప్పారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. తమ సంఘం సభ్యుల కోసం ఉచితంగా చికిత్స నిర్వహించిందుకు ఈ సందర్భంగా వాసన్ ఐకేర్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సగర సంఘ నాయకులు సుతారి భిక్షపతి, దుంపల మహేందర్, కే రాజు దుంపల రవి, తాడిశెట్టి శ్రీధర్, ఎంజాల సుమన్, వాసన్ ఐకేర్ దవాఖాన సిబ్బంది అనిశెట్టి చేతన్, తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం డిగ్రీ కళాశాలలో కెరీర్ రెడీనెస్ ప్రోగ్రాం

**ఆత్మవిశ్వాసం, సమస్య పరిష్కార నైపుణ్యాలు ముఖ్యమన్న ప్రిన్సిపాల్**

**భద్రాచలం, భద్రాద్రి న్యూస్ సెప్టెంబర్ 01,**

భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం లాంచ్ గర్ల్స్ కెరీర్ రెడీనెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జాన్ మిల్టన్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటినుండే కెరీర్ గైడెన్స్ పట్ల అవగాహన కలిగి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. మూడు సంవత్సరాల ప్రోగ్రాం ద్వారా అనుకున్న గోల్ సాధించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి. రాగ సుమ, లహరి, డా. కపిలభారతి, డా. నాగ సమీరా, హిమజ



తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 1న "పెన్షన్ విద్రోహ దినం"

**-మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శనలు**

**TGEJAC -- చంద్రుగొండ**



**చంద్రుగొండ/జూలూరుపాడు(భద్రాద్రి న్యూస్ )ప్రతినిధి:**

కొత్త పెన్షన్ విధానం CPS (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం)ను రద్దు చేసి, ఉద్యోగులకు సామాజిక భద్రత కల్పించే పాత పెన్షన్ విధానం (OPS)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం "పెన్షన్ విద్రోహ దినం"గా పాటించి చంద్రుగొండ మండలం లోని ఉద్యోగ ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాన్ని తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు, ఈ సందర్భంగా TGEJAC నాయకులు మాట్లాడుతూ .. 2004 సెప్టెంబర్ 1వ తేదీ నుండి నియమితులైన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు అమలు చేస్తున్న జూా విధానంలో భవిష్యత్తుకు తగిన సామాజిక భద్రత లేదని అన్నారు. ఉద్యోగుల భవిష్యత్తు, కుటుంబాల ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని జూాను రద్దు చేసి ూూాను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో TGEJAC నాయకులు ఎస్ వెంకటేశ్వర్లు, ఎన్ వెంకటేశ్వర్లు, రాంసింగ్, లోకేష్, కే సుధాకర్, యస్ రామకృష్ణమాచారి, ఏ శ్రీను, బి శ్రీను, ఎన్ కౌశల్య, బి బద్రు, ఎం చిరంజీవి ఎం అనూ రాధ, టి రాధా, జి రాంబాబు, బి అనిత సేవా చందు ఎం శీను నాగరాజు మొదలగు వారు పాల్గొన్నారు

# ప్రజాధనానికి లెక్క చెప్పాలి.. పదవికి రాజీనామా చేయాలి..!: కాంగ్రెస్





**భద్రాచలం, భద్రాద్రి న్యూస్,సెప్టెంబర్ 01,**

భద్రాచలం మండలంలో నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు గారి సమక్షంలో భారీ బైక్ ర్యాలీ.అనంతరం ప్రజాధనానికి లెక్క చెప్పాలని, ప్రజలకు దూరంగా ఉంటున్న ప్రధాన ప్రతిపక్ష నాయకుడు వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గారి ఆధ్వర్యంలో మంగళవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభమై అంబేద్కర్ సెంటర్, యూబీ రోడ్, నెహ్రూ మార్కెట్, జీసీసీ రోడ్డు మీదుగా తిరిగి అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగింది. అనంతరం అంబేద్కర్ సెంటర్ వద్ద మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. దేశంలో ఏ ప్రతిపక్ష నాయకుడైనా ప్రజలకు దూరంగా ఉంటూ, సుమారు 1000 రోజులుగా ఫామ్‌హౌస్‌కే పరిమితమైన పరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం విఫలమైతే ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించాల్సిన ప్రధాన ప్రతిపక్ష నాయకుడే ప్రజలకు దూరంగా ఉంటే ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పాత్ర ఏమిటని నిలదీశారు. గత మూడు సంవత్సరాలుగా ప్రజల సొమ్ము రూ.22 కోట్ల 24 లక్షల 40 వేల మొత్తాన్ని తీసుకుంటూ ప్రజలకు ముఖం చూపించని వ్యక్తి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు డిమాండ్ చేశారని తెలిపారు. ఈ డిమాండ్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు మండల కేంద్రాల్లో సైకిల్, మోటార్‌సైకిల్ ర్యాలీలు, జిల్లా కేంద్రాల్లో భారీ ర్యాలీలు నిర్వహించాలని, అంబేద్కర్ చౌరస్తాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించాలని సీఎం గారు కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారని పేర్కొన్నారు.

**భద్రాచలంలో కాంగ్రెస్ శ్రేణుల భారీ ప్రదర్శన**

ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ బైక్ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, NSUI, యూత్ కాంగ్రెస్ నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ గారు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ నాయకులు , కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, అధిక సంఖ్యలో యూత్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజల పక్షాన కాంగ్రెస్..**

ప్రజాధనానికి లెక్క అడుగుతున్న కాంగ్రెస్..

ప్రజాస్వామ్యంలో బాధ్యతాయుతమైన ప్రతిపక్షం కోసం కాంగ్రెస్ పోరాటం..

# పాఠశాలకు పూర్వ విద్యార్థి రూ.1.20 లక్షల విలువైన సామగ్రి అందజేత

**డీఎస్పీ గొర్రె మధు దాతృత్వాన్ని కొనియాడిన ఉపాధ్యాయులు**






**జూలూరుపాడు/చంద్రుగొండ(భద్రాద్రి న్యూస్)ప్రతినిధి:**

తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహకరిస్తూ, విద్యార్థుల కష్టాలను తీర్చేందుకు పూర్వ విద్యార్థులు ముందుకురావడం అభినందనీయమని జూలూరుపాడు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నరసయ్య అన్నారు. జూలూరుపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదివి, సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటూ విద్యాభ్యాసం పూర్తి చేసిన పూర్వ విద్యార్థి, ప్రస్తుత మంచిర్యాల డీఎస్పీ గొర్రె మధు తన తల్లిదండ్రులు దివంగత గొర్రె నరసయ్య -- బాలమ్మ జ్ఞాపకార్థం పాఠశాలకు సుమారు రూ.1,20,000 విలువైన సామగ్రిని విరాళంగా మంగళవారం అందజేశారు.ఇందులో భాగంగా విద్యార్థుల తాగునీటి అవసరాల కోసం ఆర్వో వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంట్, తరగతి గదుల్లో కూర్చోవడానికి 20 బెంచీలు, అలాగే పాఠశాల కార్యాలయ పనులు, విద్యార్థుల ఆన్‌లైన్ డేటా ఎంట్రీ, స్కాలర్‌షిప్‌లు ఆధార్ అనుసంధాన ప్రక్రియల కోసం ల్యాప్‌టాప్ ప్రింటర్‌ను సమకూర్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఉన్నత స్థానానికి చేరుకున్నా మూలాలను మర్చిపోకుండా, పేద విద్యార్థుల అవసరాలను గుర్తించి పెద్ద మనసుతో చేయూతనిచ్చిన డీఎస్పీకి ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రీ-ప్రైమరీ బోధనలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి

**ఖమ్మం జిల్లా విద్యాశాఖాధికారి, జి. సదానందం**

**ఖమ్మం, సెప్టెంబర్ 01**

**(భద్రాద్రిన్యూస్ ):-**




ప్రభుత్వ డి ఈ టి, ఖమ్మంలో నిర్వహిస్తున్న ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ జి. సదానందం మంగళవారం సందర్శించి, శిక్షణలో పాల్గొంటున్న ఇన్‌స్ట్రక్టర్లను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రీ-ప్రైమరీ స్థాయిలో పనిచేస్తున్న ఇన్‌స్ట్రక్టర్లు తమ పాత్రలు, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు, విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే మంచి విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, సృజనాత్మకత వంటి లక్షణాలను పెంపొందించే విధంగా బోధన చేపట్టాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల వయస్సు, అభిరుచులకు అనుగుణంగా విలువాధారిత మరియు ఆనందదాయకమైన అభ్యసన వాతావరణాన్ని కల్పించాలని తెలిపారు. తల్లి స్థానంలో ఉండి ప్రేమ మరియు ఆప్యాయతలు కలిపి బోధన కొనసాగించాలని కోరారు. అకడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీ పెసర ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, పాఠశాలల్లోని ప్రీ-ప్రైమరీ విభాగాల్లో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శిక్షణలో పొందిన కార్యాచరణ ఆధారిత బోధన-- అభ్యసన పద్ధతులను పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. పిల్లలకు ఆటలు, పాటలు, కథలు, సృజనాత్మక కార్యకలాపాల ద్వారా బోధన అందించడం వల్ల అభ్యసన పట్ల ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ శ్రీ ప్రవీణ్, శ్రీ జీవన్, శ్రీ శ్రవణ్ మరియు శ్రీ అనిల్ శిక్షణ అందించారు. మొత్తం 144 మంది ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు, ఏ ఎం వో వింగ్ సీనియర్ అసిస్టెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణలో పొందిన జ్ఞానం, నైపుణ్యాలను పాఠశాలల్లో ఆచరణలోకి తీసుకువచ్చి, ప్రీ-ప్రైమరీ విద్యార్థులకు నాణ్యమైన, ఆనందదాయకమైన మరియు కార్యాచరణ ఆధారిత అభ్యసనాన్ని అందించాలని అధికారులు సూచించారు.

# సీపీఎస్ రద్దు కోరుతూ ఉపాధ్యాయుల నిరసన

**జూలూరుపాడు/చంద్రుగొండ(భద్రాద్రి న్యూస్)ప్రతినిధి:**




కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకంను వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని ఓపీఎస్ ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సీపీఎస్ అంతం -- ఉద్యోగుల పంతం నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులంతా ముక్తకంఠంతో తమ నిరసన గళాన్ని వినిపించారు. ఈ సందర్భంగా వివిధ ఉపాధ్యాయ సంఘాల మండల, జిల్లా టీజీఈ జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ప్రజా ప్రభుత్వంగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని స్పష్టం చేశారు. గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయాలని, నూతన వేతన సవరణ సంఘం పీఆర్సీ నివేదికను ప్రకటించి అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ జిల్లా నాయకుడు బోడ కృష్ణతో పాటు పీఆర్‌టీయూ, యూటీఎఫ్, టీటీఎఫ్ మండల బాధ్యులు, ఉపాధ్యాయులు ఉమ, శాంతకుమారి, వెంకటేశ్వర్లు, జీవీఆర్ ప్రసాద్, అరుణకుమారి, లలిత, సునీత, సావిత్రి, ఉపేంద్రమ్మ పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు చేయాలి.. ఓపీఎస్ అమలు చేయాలి




**నల్ల బ్యాడ్జీలతో ఆర్అండ్‌బీ ఉద్యోగుల నిరసన**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 1 (భద్రాద్రి న్యూస్):**

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా ఆర్అండ్‌బీ శాఖ ఉద్యోగులు మంగళవారం నిరసన చేపట్టారు. సీపీఎస్ విద్రోహ దినం సందర్భంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులకు భద్రత లేని పెన్షన్ వ్యవస్థ ఏర్పడుతోందని, ఉద్యోగుల భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ ఎన్. సూరిబాబు, టీఎన్‌జీవో ఆర్అండ్‌బీ విభాగం అధ్యక్షులు, సూపరింటెండెంట్ ఆర్. సూర్యనారాయణ, టీఈఏ అధ్యక్షులు పి. నాగరాజు, టీఎన్‌జీవో ఆర్అండ్‌బీ విభాగం కార్యదర్శి జి. నరసింహారావు, పీఏ టు ఈఈ జి. రాధిక తదితరులు పాల్గొన్నారు. ఆర్అండ్‌బీ డిపార్ట్‌మెంట్‌లోని వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో నల్ల బ్యాడ్జీలు ధరించి కార్యక్రమంలో పాల్గొని సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలు కోసం తమ డిమాండ్‌ను బలంగా వినిపించారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా?

**-ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు**

**- బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడ్డానికి సిగ్గుండాలి**

**- రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా**

**- విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడు నల్లమోతు వెంకటరమణ**

**చంద్రుగొండ/ జూలూరుపాడు (భద్రాద్రి న్యూస్) ప్రతినిధి:**



వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా అని చంద్రుగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోతు వెంకటరమణ సవాల్ విసిరారు. మంగళవారం చంద్రుగొండ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండలంలో సుమారు 1,100 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రైతులకు రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అర్హులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు వస్తే అభివృద్ధిపై వాస్తవాలతో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని నల్లమోతు వెంకటరమణ స్పష్టం చేశారు.మండల నాయకులు మాలోతు భోజ్య నాయక్, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి కొదుమూరి దయాకర్, మాజీ జెడ్పీటిసి అంకిరెడ్డి కృష్ణారెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కెసిబోయిన నరసింహారావు, ఫజల్ బక్షి, దారం గోవిందరెడ్డి, బోర సురేష్, సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి తదితులు పాల్గొన్నారు..

# సిపిఎస్ రద్దు చేసి.. ఓ పి ఎస్ పునరుద్ధరించాలి





**పెన్షన్ భద్రతకు ప్రభుత్వం హామీ ఇవ్వాలి**

**సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి: టీజీఈ జె .ఎ.సి**

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 1 (భద్రాద్రిన్యూస్):**

సెప్టెంబర్ 1 "పెన్షన్ విద్రోహ దినం" సందర్భంగా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం టీజీఈ జె .ఎ.సి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఐ డి ఓ సి వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని "సిపిఎస్ రద్దు చేయాలి--ఓ పి ఎస్ పునరుద్ధరించాలి", "ఉద్యోగుల భవిష్యత్తుకు పెన్షన్ భద్రత కల్పించాలి" అంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా టీజీఈ జె .ఎ.సి జిల్లా చైర్మన్ అమరనేని రామారావు, కన్వీనర్ సంగం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ.. పెన్షన్ ఉద్యోగికి ప్రభుత్వం ఇచ్చే వరం కాదని, ప్రభుత్వ సేవలో జీవితాంతం పనిచేసిన ఉద్యోగికి పదవీ విరమణ అనంతరం గౌరవప్రదమైన జీవితం కోసం అవసరమైన సామాజిక భద్రత, హక్కు అని పేర్కొన్నారు. సిపిఎస్ విధానంలో పెన్షన్ ప్రయోజనాలు పెట్టుబడుల రాబడిపై ఆధారపడటంతో ఉద్యోగుల భవిష్యత్తులో అనిశ్చితి ఏర్పడుతోందన్నారు. అందువల్ల సిపిఎస్ను రద్దు చేసి ఓ పి ఎస్ ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

**జిల్లా వ్యాప్తంగా నిరసనలు**

జిల్లా కేంద్రంలోని ఐ డి ఓ సి తో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. సెప్టెంబర్ 10న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమంలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**ఎన్నికల హామీ అమలు చేయాలి**

టీజీఈ జె .ఎ.సి రాష్ట్ర కార్యదర్శి రాజు, జిల్లా జేఏసీ నాయకులు ఎం. వెంకటేశ్వరరావు, వెస్లీ, లాల్ మహమ్మద్, తుక్కాని శ్రీనివాసరెడ్డి, హరిలాల్, లక్ష్మణ్ నాయక్, వనమా శ్రీనివాసరావు, డి.వి. దినేష్ మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో సిపిఎస్ ను రద్దు చేసి ఓ పి ఎస్ ను అమలు చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ హామీ అమలులో పురోగతి లేకపోవడం ఉద్యోగుల్లో అసంతృప్తికి కారణమవుతోందన్నారు. పి .ఆర్ .సి ,డి ఏ

**లు, ఆరోగ్య పథకంపై డిమాండ్లు**

ఉద్యోగులకు పి .ఆర్ .సి అమలు, పెండింగ్ ,డి ఏ ల విడుదల, మెరుగైన ఆరోగ్య పథకం అమలు వంటి ప్రధాన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని నాయకులు కోరారు. ఉద్యోగుల సమస్యలను ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ హామీల అమలులో జాప్యం, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య పరిస్థితుల నేపథ్యంలో టీజీఈ జె .ఎ.సి రాష్ట్ర నాయకత్వం దశలవారీ ఉద్యమ కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఐక్యంగా ఉద్యమంలో పాల్గొని తమ న్యాయమైన హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కృష్ణయ్య, దస్రు, రాణి, రమేష్, కామేశ్వరరావు, వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి, శ్రీనివాసరావు తదితరులతో పాటు ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జీహెచ్ఎంసీలో బయటపడ్డ భారీ కుంభకోణం

102 మంది కాంట్రాక్టర్లకు దాదాపు రూ.70 కోట్ల డబుల్ బిల్లులు చెల్లించిన అధికారులు విషయం బయటికి రావడంతో కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు వసూలు చేసే పనిలో పడ్డ అధికారులు 12 మంది కాంట్రాక్టర్ల నుంచి రూ.7 కోట్లు వసూలు విజిలెన్స్ ఎంక్వైరీకి ఆదేశించిన జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ డబుల్ బిల్లులు చెల్లించడమే కాకుండా, ఎక్సెస్ అమౌంట్ కూడా చెల్లించినట్లు విజిలెన్స్ అధికారుల గుర్తింపు ఘటనకు బాధ్యుడిగా భావిస్తూ, జీహెచ్ఎంసీ ఫైనాన్షియల్ అడ్వైజర్ శరత్ చంద్రను విధుల నుంచి తప్పించిన కమిషనర్

GHMC
GREATER HYDERABAD
MUNICIPAL CORPORATION

# ఆదివాసీ మహిళలపై అఘాయిత్యాలా..? ఇక సహించేది లేదు!

**చర్లలో గోండ్వానా సంక్షేమ పరిషత్ 48 గంటల రిలే దీక్షలు ప్రారంభం**

**అత్యాచారాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలి.. కఠిన చట్టాలు తీసుకురావాలి: సొందే వీరయ్య**

**ఏజెన్సీ హక్కులను నిర్వీర్యం చేసే కుట్రలను అడ్డుకోవాలి.. ఆదివాసీ యువత ఉద్యమించాలి**





**చర్ల సెప్టెంబర్ 1 భద్రాద్రి న్యూస్**

ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేస్తూ గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో 48 గంటల రిలే దీక్షలు మంగళవారం చర్ల మండల కేంద్రంలోని కొమరం భీం విగ్రహం వద్ద ప్రారంభమయ్యాయి. సంఘం ఉభయ రాష్ట్రాల కన్వీనర్ సొందే వీరయ్య దీక్షలను ప్రారంభించారు.

దీక్షల ప్రారంభానికి ముందు ఇటీవల మృతి చెందిన ఉయక శిరీషకు నాయకులు, కార్యకర్తలు ఒక నిమిషం మౌనం పాటించి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సొందే వీరయ్య మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ మహిళలనే లక్ష్యంగా చేసుకుని అత్యాచారాలు, అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఆదివాసీ మహిళలపై కన్నెత్తి చూసే పరిస్థితి కూడా లేకుండా కఠినమైన చట్టాలను అమలు చేయాలని కోరారు.

### జీవో నంబర్ 3 కోసం రెండు దశాబ్దాల పోరాటం

భద్రాచలం కేంద్రంగా గత రెండు దశాబ్దాలుగా ఆదివాసీల హక్కుల కోసం చైతన్య కార్యక్రమాలు, ఉద్యమాలు నిర్వహించామని సొందే వీరయ్య గుర్తుచేశారు. ఆ ఉద్యమాల ఫలితంగానే అనేక మంది ఆదివాసీ నిరుద్యోగులు జీవో నంబర్ 3 ద్వారా ఉద్యోగ అవకాశాలు పొంది లబ్ధి పొందారని తెలిపారు.

1998 నుంచి 2017, 2018 వరకు జీవో నంబర్ 3 అంశంపై న్యాయపోరాటం కొనసాగిందని పేర్కొన్నారు. ఆదివాసీల హక్కులు, ఉద్యోగ అవకాశాల పరిరక్షణ కోసం సాగిన పోరాటాలను భవిష్యత్ తరాలకు కూడా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

### ఏజెన్సీ చట్టాలను నిర్వీర్యం చేసే కుట్రలను అడ్డుకోవాలి

ఏజెన్సీ ప్రాంతాల్లో యువత ఉద్యమించకపోతే భవిష్యత్తులో ఆదివాసీలకు రక్షణగా ఉన్న చట్టాలను నిర్వీర్యం చేసేందుకు గిరిజనేతర శక్తులు కుట్రలు చేసే ప్రమాదం ఉందని సొందే వీరయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం యువత ముందుకు వచ్చి ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

మొదటి రోజు రిలే దీక్షకు ముమ్మినేని అరవింద్, ఎమ్మార్పీఎస్ నాయకులు సీహెచ్ రామ్మూర్తి తదితరులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు బీరబోయిన శేఖర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొంది లీలాప్రసాద్, బీరబోయిన అరుణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరప అంజిబాబు, మండల అధ్యక్షుడు కాయం శ్రీనివాసరావు, మండల కార్యదర్శి, డివిజన్ నాయకులు పాయం సన్యాసి, సున్నం అడ్వాన్స్‌డ్, యాలం నరసింహారావు, ఆదివాసీ సీనియర్ నాయకులు బీరబోయిన నాగయ్య, శ్యామల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఆదివాసీ మహిళలకు రక్షణ కల్పించడంతో పాటు ఏజెన్సీ చట్టాలు, హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ వైఫల్యాలు, అబద్ధాలను ఎండగడతాం





**6 గ్యారెంటీలు, 420 హామీల అమలులో ప్రభుత్వం విఫలం**

**సెప్టెంబర్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు: మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు**

**మధిర, సెప్టెంబర్ 1 (భద్రాద్రి న్యూస్):**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు లింగాల కమల్ రాజు విమర్శించారు. 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని బాండ్ పేపర్లు రాసి, దేవుడి సాక్షిగా ప్రమాణాలు చేసి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు.

తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్ ఆదేశాలు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు సూచనల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజల్లో ఎండగట్టేందుకు సెప్టెంబర్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

### హామీల అమలులో విఫలం

ప్రభుత్వ పదవీకాలంలో సగానికి పైగా సమయం పూర్తయినా హామీల అమలులో ఆశించిన పురోగతి లేదని కమల్ రాజు విమర్శించారు. కళ్యాణలక్ష్మి పథకంతో పాటు తులం బంగారం ఇస్తామని చేసిన హామీ, పింఛన్లు, రైతు భరోసా, కౌలు రైతులకు సహాయం, ఆడబిడ్డలకు స్కూటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. ₹4,000 పింఛన్, వికలాంగులకు ₹6,000 పింఛన్ వంటి హామీలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### కేసీఆర్ పేరుతోనే కాంగ్రెస్ పాలన:

ముఖ్యమంత్రి, కాంగ్రెస్ మంత్రులు తమ పరిపాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కేసీఆర్, బీఆర్ఎస్ నాయకత్వంపై విమర్శలు చేస్తున్నారని కమల్ రాజు ఆరోపించారు. అసెంబ్లీలో కేటీఆర్, హరీష్ రావుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పలువురు మంత్రులతో మాట్లాడిస్తున్నారని విమర్శించారు. ప్రజల సొమ్ముతో ప్రచారాలకు అధికంగా ఖర్చు చేస్తున్నారని, పదవుల్లో లేని కుటుంబ సభ్యులకు ఎస్కార్ట్లు, గన్‌మెన్లను కేటాయించి ప్రభుత్వ వనరులను వినియోగిస్తున్నారని ఆరోపించారు.

### నేటి నుంచి ర్యాలీలు, ధర్నాలు

మిగిలిన సమయంలోనైనా రాజకీయ విమర్శలకు స్వస్తి పలికి 6 గ్యారెంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని కమల్ రాజు డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 2 నుంచి నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వారం రోజుల పాటు వివిధ వర్గాల సమస్యలపై నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని, మధిరలో నిర్వహించే నిరసన కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బిక్కి కృష్ణ ప్రసాద్, చిత్తారు నాగేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, కనుమూరు వెంకటేశ్వరరావు, అరిగ శ్రీనివాసరావు, అప్పారావు, బొగ్గుల భాస్కర్ రెడ్డి, చావా వేణు, రంగిశెట్టి కోటేశ్వరరావు, ఆళ్ల నాగబాబు, ఉమామహేశ్వరరావు, నాగులవంచ రామారావు, కోన నరేంద్ర, చిదిరాల, అబ్దుల్ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి దుర్మార్గపు చర్యలను ఖండించాలి

**నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుజ్జర్లపూడి రాంబాబు మేకల మల్లిబాబు యాదవ్, షేక్ పతే మహమ్మద్**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 1 (భద్రాద్రిన్యూస్ ):-**

రాజకీయంగా ఎదుర్కోలేక, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వ్రాసిన రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ దురుద్దేశపూర్వకంగా రాహుల్ గాంధీ పై కేసులు పెట్టిన, మతోన్మాద బీజేపీ దుశ్చర్యలను ఎండగట్టాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు.

ఉత్తరాఖండ్ రాష్ట్రంలో

రాహుల్ గాంధీ పై బిజెపి నాయకులు వేసిన అక్రమ కేసుకు నిరసనగా మంగళవారం నాడు కామేపల్లి మండలం కొత్త లింగాల క్రాస్ రోడ్ లో మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా కార్యదర్శి షేక్ పతే మహమ్మద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గ్రబు నాయక్ తదితరులు పాల్గొని ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ఫాసిస్ట్ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలకు ఇది ఒక ఉదాహరణ మాత్రమేనని, దళిత ముద్దుబిడ్డ, జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కూర్చున్న స్థలాన్ని శుద్ధి చేసి అవమాన పరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నందుకు, బిజెపి గ్రాఫ్ ఎక్కడ పడిపోతుందో అనే భయం చేత భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ పై కక్ష సాధింపు ధోరణితో తిరిగి రివర్స్ లో కేసు పెట్టడం జరిగిందని, ఈ విషయంలో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశం యావత్తు సిగ్గుతో తలదించుకోవాల్సి వచ్చిందని, అంతేకాకుండా ఇటీవల నీటు విద్యార్థుల పరీక్షలలో అక్రమాలు జరిగాయని విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం జరిగితే వారిపై తుపాకీ కాల్పులు జరపడం జరిగిందని,

అడవులను,ఖనిజాలను, పెట్టుబడిదారీ వ్యవస్థకు దుర్మార్గంగా



అప్పగించాలని దురుద్దేశంతో, అడవులపై కన్నేసి, అడవుల ఆక్రమణకు అడ్డంగా ఉంటున్నారని నివసిస్తున్న గిరిజనులను నిర్దాక్షిణ్యంగా తరిమికొట్టి, వారికి అండగా ఉంటున్న నక్సలైట్లను బూటకపు

ఎన్ కౌంటర్ చేసి కాల్చివేసిన ఘనత బిజెపి పార్టీకి దక్కిందని, హిందుత్వం పేరుతో ప్రజలను మోసం చేస్తూ,

ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో తరతరాలుగా నివసిస్తున్న వారి ఓట్లను కూడా తొలగించి న బిజెపి పాశవిక చర్యలను తిప్పి కొట్టాలని, రాహుల్ గాంధీ పై పెట్టిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును తిరిగి వాపస్ తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎడ్లపల్లి శేషగిరిరావు, కాట్రాల వీరబాబు, పింజర మడుగు సర్పంచ్ గుగులోతు భాష,కొమ్మినేపల్లి ఉప సర్పంచ్ మేకల మల్లిఖార్జున రావు,సత్తి వీరబాబు, పండగ కోటి, కమటం వెంకటేశ్వర్లు, చెరుకుమల్ల బుచ్చయ్య, ఎరకల రమేష్,ఆలోత్ శివ, రాము, మంగ్యా జీ నాయక్, బద్రు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, వివిధ గ్రామాల శాఖ అధ్యక్షులు, సర్పంచులు ఉప సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతులను నమ్మకుండా డిక్లరేషన్లు, బాండ్ పేపర్లు ఎందుకు?

**సన్న వడ్ల రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ అందించాలి**

**పత్రాల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు: వైరా మాజీ ఎమ్మెల్యే డా. బానోత్ చంద్రావతి**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 1 (భద్రాద్రి న్యూస్):**



సన్న వడ్లు పండిస్తే క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఆ హామీని నమ్మి రైతులు విత్తనాలు కొనుగోలు చేసి, పెట్టుబడులు పెట్టి పంట సాగు చేశారని వైరా మాజీ ఎమ్మెల్యే డా. బానోత్ చంద్రావతి అన్నారు. అయితే బోనస్ పొందేందుకు ప్రస్తుతం రకాల పరిమితులు, రిజిస్ట్రేషన్లు, డిక్లరేషన్లు, బాండ్ పేపర్ల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఆమె పేర్కొన్నారు. ఏ రైతు ఏ రకం వరి సాగు చేస్తున్నాడో తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, డిజిటల్ క్రాప్ సర్వే వంటి వ్యవస్థలు అందుబాటులో ఉన్నప్పుడు రైతే మళ్లీ తన పంటను నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఎందుకు రావాలని చంద్రావతి ప్రశ్నించారు. పంట సాగు ప్రారంభమైన తర్వాత కొత్త షరతులు విధించడం వల్ల ప్రభుత్వం ఇచ్చిన హామీని నమ్మి సన్న వడ్లు సాగు చేసిన నిజమైన రైతులు బోనస్‌కు దూరం కాకూడదన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా రైతుల అర్హతను నిర్ధారించి, అర్హులైన ప్రతి రైతుకూ బోనస్ అందించాలని ఆమె డిమాండ్ చేశారు. ముఖ్యంగా బోనస్ నమోదు, ధృవీకరణకు విధించిన సెప్టెంబర్ 10 కటాఫ్ తేదీని పొడిగించాలని కోరారు.

**ప్రధాన డిమాండ్లు**

అర్హత కలిగిన సన్న వడ్ల రైతులందరికీ క్వింటాకు రూ.500 బోనస్ పూర్తిగా చెల్లించాలి.

డిక్లరేషన్లు, బాండ్ పేపర్లు, ఇతర పత్రాల ప్రక్రియను రైతులకు భారంగా లేకుండా సరళీకరించాలి.

వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి పరిశీలన, డిజిటల్ క్రాప్ సర్వే ఆధారంగా వరి రకాన్ని నిర్ధారించాలి.

పంట సాగు ప్రారంభమైన తర్వాత నిబంధనలు మార్చి నిజమైన రైతులను బోనస్‌కు అనర్హులుగా చేయకూడదు.

సెప్టెంబర్ 10 కటాఫ్ తేదీని పొడిగించి ఒక్క అర్హ రైతు కూడా అవకాశాన్ని కోల్పోకుండా చూడాలి.

విత్తన బిల్లులు లేదా ఇతర పత్రాలు లేని రైతులకు ప్రత్యామ్నాయ క్షేత్రస్థాయి ధృవీకరణ విధానం కల్పించాలి.

బోనస్‌కు అర్హమైన వరి రకాలు, నమోదు విధానం, అవసరమైన పత్రాలపై గ్రామస్థాయిలో స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలి.

ఈ సందర్భంగా స్థానిక రైతులు జెర్పలా వేంకన్న, నుండావత్ కృష్ణ, అజ్మీరా భాష, వడతియా అంజని కుమార్, వడతియా హరిసింగ్, తేజావత్ వీరన్న, వడతియా హనుమా, వాంకడోత్ కృష్ణ, బుక్యా రామచంద్రు తదితరులతో కలిసి చంద్రావతి పంట పొలాలను పరిశీలించారు. రైతులను కలిసి సన్న వడ్ల సాగు, బోనస్‌కు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అర్హులైన రైతులందరికీ ఎలాంటి సాంకేతిక, పత్రాల అడ్డంకులు లేకుండా క్వింటాకు రూ.500 బోనస్ అందేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డా. బానోత్ చంద్రావతి డిమాండ్ చేశారు.

# పోటీ పరీక్షలకు ప్రణాళికాబద్ధమైన చదువే విజయానికి బాట

**5 నెలల ఉచిత ఫౌండేషన్ కోచింగ్ ప్రోగ్రామ్ ప్రారంభం**

**అభ్యర్థులు క్రమశిక్షణతో చదివి లక్ష్యాన్ని సాధించాలి: అదనపు కలెక్టర్ డా. శ్రీజ**







**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 1 (భద్రాద్రి న్యూస్):**

ఖమ్మం బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-I, II, III, IV, , ఆర్ఆర్ బి ఎస్ఎస్ సి , బ్యాంకింగ్, పోలీస్ తదితర పోటీ పరీక్షలు--2026--27కు సంబంధించి నిర్వహించనున్న 5 నెలల ఉచిత ఫౌండేషన్ కోచింగ్ ప్రోగ్రామ్‌ను ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డా. శ్రీజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు ముందుగానే సరైన స్టడీ ప్లాన్‌ను రూపొందించుకుని, దానికి అనుగుణంగా క్రమశిక్షణతో చదవాలని సూచించారు. నిరంతర సాధన, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే లక్ష్యాన్ని చేరుకోవచ్చని తెలిపారు. చదువులో ఎదురయ్యే సవాళ్లను చూసి వెనుకడుగు వేయకుండా వాటిని అవకాశాలుగా మలుచుకోవాలని అభ్యర్థులకు సూచించారు. మానసికంగా దృఢంగా ఉంటూ, సమయపాలన పాటిస్తూ పరీక్షలకు సిద్ధం కావాలని డా. శ్రీజ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, ఫ్యాకల్టీలు డా. శ్రీ హరి కాకర్ల, శ్రీ అన్నం కళింగ రెడ్డితో పాటు బీసీ స్టడీ సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు చేయాలి.. ఓపీఎస్ అందించాలి




**పెన్షన్ హక్కును కాపాడి ఉద్యోగులకు సామాజిక భద్రత కల్పించాలి**

**వెంకటాపురం భద్రాద్రి న్యూస్న్యూస్, సెప్టెంబర్ 1:**

సెప్టెంబర్ 1ను పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ ములుగు జిల్లా వెంకటాపురం జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం సామాజిక భద్రత కల్పించే పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పెన్షన్ ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా అని, దీర్ఘకాల ప్రభుత్వ సేవలందించిన ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం గౌరవప్రదమైన జీవితం కల్పించే విధంగా పెన్షన్ విధానం ఉండాలని వారు పేర్కొన్నారు. నల్ల బ్యాడ్జీలు ధరించడం ద్వారా తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేస్తూ, ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన పెన్షన్ హక్కు కోసం ఐక్యంగా పోరాడతామని తెలిపారు.

"పెన్షన్ మా హక్కు -- భిక్ష కాదు", "సీపీఎస్ రద్దు చేయాలి -- ఓపీఎస్ పునరుద్ధరించాలి" అంటూ నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.జయరాం, జె.సుబ్బారెడ్డి, సిఫాన్ నర్సింహారావు, జి.వెంకటేశ్వరరావు, వంగి వెంకటేష్, నాగమణి, బిక్షమణి, జి.రాంచంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 4న డబ్ల్యూజేఐ విస్తృత స్థాయి సమావేశం

**సభ్యత్వాల నమోదు, జర్నలిస్టుల సమస్యలపై చర్చ**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబరు 1 (భద్రాద్రిన్యూస్) :**



ఈ నెల 4న 'వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా' (డబ్ల్యూజేఐ) ఖమ్మం జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు యూనియన్ జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్ తెలిపారు. ఖమ్మంలోని ఎన్.ఎస్.పి రామాలయం ఫంక్షన్ హాల్లో ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొత్తగా సంఘంలో చేరిన సభ్యుల నుండి అంగీకార పత్రాలను స్వీకరించడంతో పాటు జర్నలిస్టుల సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. కొత్తగా డబ్ల్యూజేఐలో చేరాలని భావిస్తున్న జర్నలిస్టులందరినీ ఈ సమావేశానికి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. డబ్ల్యూజేఐ దేశంలోని 16 రాష్ట్రాల్లో బలమైన సంఘంగా జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతుందన్నారు. ఇది జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం మరియు వృత్తి పరమైన గౌరవం కోసం పని చేస్తుందని పేర్కొన్నారు. ప్రపంచంలోనే (దేశంలో మొదటిది) రెండో అతి పెద్ద కార్మిక సంఘమైన భారతీయ మజ్దూర్ సంఘ్ (బి.ఎం.ఎస్) కు అనుబంధంగా పని చేస్తున్న ఈ సంఘం, జర్నలిజంలో జాతీయ ధృక్పదాన్ని, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆనంద్ తెలిపారు.

# హసన్ పర్తి లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజా ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో డిజిటలైజేషన్ చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని ఎమ్మెస్సార్ గార్డెన్ లో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ ఎంపీ కడియం కావ్య చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు, కావ్యాలు మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు దిగ్విజయంగా పూర్తి చేసుకోవడం సంతోషదాయకమని ఆనందం వ్యక్తం చేశారు. ప్రజా ఆమోదంతో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బిఆర్ఎస్, బిజెపి నాయకులు అసత్య ఆరోపణలతో ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని, వారి ఆరోపణలను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలైన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత కరెంట్, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన, ఉద్యోగులకు పిఆర్సి, నెల మొదటి రోజే జీతాలు, అర్హులైన వారికి పెన్షన్, వ్యవసాయదారులకు రుణమాఫీ వంటి అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని వారు తెలిపారు. స్థానిక తహసిల్దార్ పూజారి కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ పంపిణీ కార్యక్రమంలో ఆర్ ఐ ఫాజల్, రమేష్, ఎంపీడీవో సుమ వాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, రేషన్ కార్డుదారులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్**
**ఐ.డీ.ఓ.సీ సమావేశపు హాలులో**
**వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్ల పై సమావేశం**

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 1( భద్రాద్రిన్యూస్ ):-**
ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. మంగళవారం ఐ.డీ.ఓ.సీ కార్యాలయంలోని సమావేశపు హాలులో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, పంచాయతి రాజ్, అగ్నిమాపక,ఐ.టీ.సీ,సింగరేణి, ఎక్సైజ్, విద్యుత్,ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి పకడ్బందీ చర్యలు తీసుకావాలని అన్నారు. అన్ని గణేష్ మండపాలను తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ముందస్తుగా గణేష్ మండలి నిర్వాహకులు పూర్తి వివరాలు అందించాలని, ఇది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు.

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండల స్థాయిలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమావేశాలు నిర్వహించాలని పేర్కొన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు మొదటి రోజు నుండి నిమజ్జనం వరకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రశాంత వాతావరణంలో, అవాంచనీయ సంఘటనలు తావు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

మండపాలకు విద్యుత్ ఏర్పాటుకు తప్పని సరిగా విద్యుత్ శాఖ నుండి అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలుపై విద్యుత్ అధికారులు మండపాల్లో ఆడిట్ నిర్వహించాలని సూచించారు. విద్యుత్ తీగలకు తగల కుండా ఎత్తు తక్కువ ఉండే విగ్రహాలు ఏర్పాటు చేయాలని అన్నారు. మండపాల్లో మైక్ ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని తెలిపారు.

భద్రాద్రి జిల్లా నుండే కాకుండా ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి నిమజ్జనానికి విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున యంత్రాంగం సూచించిన ప్రాంతాల్లో మాత్రమే అత్యంత భద్రత మధ్య నిమజ్జన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తెలియజేసారు. గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ప్రణాళికరూపొందించుకోవాలని, విగ్రహాలను నిమజ్జనం చేసుకునేందుకు అవసరమైన రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులను కోరారు. నిమజ్జనం రూట్ లో అవసరమైన రోడ్డు మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.వినాయక నిమజ్జనానికి వినియోగించే వాహనాలను ముందస్తుగా రవాణాశాఖ అధికారి నుండి ధ్రువీకరణ తీసుకోవాలన్నారు.

ప్రతి గణేష్ మండపం వద్ద అవసరమైన మేర బందోబస్తు ఏర్పాటు చేయాలని, గణేష్ నిమజ్జనం సజావుగా జరిగే విధంగా కట్టు దిట్టమైన భద్రత వ్యవస్థ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తిపాటలు మాత్రమే వినిపించాలని, మతాలు, వర్గాల మనోభావాలను గౌరవించాలని పేర్కొన్నారు. అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని, గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా ఎలాంటి రెచ్చగొట్టే అంశాల జోలికి వెళ్లవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

అనంతరం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ..గణేష్ నిమజ్జనం సందర్భంగా క్రేన్లు వినియోగించాలని, గణేష్ నిమజ్జనం జరిగే ప్రదేశాలలో గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల సహకారంతో కలిసికట్టుగా పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని అన్నారు. భక్తులకు అందించే స్వామి వారి ప్రసాదాలకు ప్లాస్టిక్ వస్తువులు వినియోగించొద్దని పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని తెలిపారు. వ్యర్థాలు వేసేందుకు డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని, రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసే విగ్రహాలు పర్యావణానికి హాని కలిగిస్తాయన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో ఉచిత మట్టిగణపతులు పంపిణీ చేయనున్నామని, ప్రజలు మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్,భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాళ్ శ్రేష్ఠ,డీ.ఆర్.ఓ పద్మావతి,డీ.టీ.ఓ వెంకట రమణ,జిల్లా ఇంచార్జ్ ఎక్సైజ్ ఈ.ఎస్ జానయ్య, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతి కుమార్, డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ తుకారాం రాథోడ్, విద్యుత్ శాఖ ఎస్.ఈ మహేంద్ర, కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ సుజాత,ఐటీసీ,సింగరేణి సంస్థ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు,కొత్తగూడెం
గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యెర్రా కామేష్, సభ్యులు దారా రమేష్, లక్ష్మణ్,వందనపు శ్రీధర్,మహేష్,సుజాత,విజయలక్ష్మి, యాకయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదు!







**అభివృద్ధి పనులపై జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి కొరడా ఝులిపింపు**
**డ్రెయిన్ ఎండ్ సోక్‌పిట్, ఫామ్‌పాండ్ పనులపై క్షేత్రస్థాయి తనిఖీ.. అధికారులకు కీలక ఆదేశాలు**
**జలసిరి, VGPP ప్లానింగ్, SEEP సర్వే, VB-G RAM G లేబర్ మొబిలైజేషన్‌పై సమీక్ష**

**చర్ల, సెప్టెంబర్ 1 (భద్రాద్రి న్యూస్):**
గ్రామీణాభివృద్ధి పనుల్లో నాణ్యతకు తిలోదకాలు ఇస్తే ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి అధికారులను హెచ్చరించారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతి పని ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని, నిబంధనలను పక్కనపెట్టి పనులు చేపడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని తేల్చిచెప్పారు.

మంగళవారం చర్ల మండలంలో పర్యటించిన జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా ఆర్.కొత్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న డ్రెయిన్ ఎండ్ సోక్‌పిట్ పనులను పరిశీలించారు. అనంతరం సత్యనారాయణపురం గ్రామంలో చేపడుతున్న ఫామ్‌పాండ్ పనులను పరిశీలించి, పనులు నిర్దేశిత అంచనాలు, సాంకేతిక ప్రమాణాలు, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని అధికారులకు సూచించారు.

**నాణ్యతలో రాజీకి నో ఛాన్స్!**

ప్రభుత్వం ప్రజల కోసం కేటాయిస్తున్న నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని నాగలక్ష్మి స్పష్టం చేశారు. కేవలం పనులు పూర్తయ్యాయని చూపించడమే లక్ష్యంగా కాకుండా, వాటి వల్ల ప్రజలకు ఎంతమేర ప్రయోజనం కలుగుతుందో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పనుల అమలులో నిర్లక్ష్యం, నాణ్యతా లోపాలు, నిబంధనల ఉల్లంఘనలకు తావివ్వకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

**నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యత**

గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, వ్యవసాయానికి అవసరమైన నీటి వనరుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సీఈఓ సూచించారు. జలసిరి, ఫామ్‌పాండ్లు, డ్రెయిన్ ఎండ్ సోక్‌పిట్లు వంటి నీటి సంరక్షణ పనులను గ్రామాల అవసరాలకు అనుగుణంగా గుర్తించి, ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు.

**గ్రామాల అవసరాల ఆధారంగానే ప్రణాళికలు**

అనంతరం చర్ల గ్రామపంచాయతీ రైతు వేదికలో VB-G RAM G ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జలసిరి, VGPP ప్లానింగ్, SEEP సర్వే, VB-G RAM G లేబర్ మొబిలైజేషన్ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. VGPP కింద గ్రామాల వాస్తవ అవసరాలను క్షేత్రస్థాయిలో గుర్తించి, ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే పనులను ప్రాధాన్యత క్రమంలో ప్రణాళికలో చేర్చాలని తెలిపారు. గాజుజ్యూ సర్వేను పకడ్బందీగా నిర్వహించి, అర్హులైన కుటుంబాలను గుర్తించడంతో పాటు గ్రామాల్లో అవసరమైన పనులను కూడా గుర్తించాలని సూచించారు.

**కూలీల సమీకరణలో నిర్లక్ష్యం వద్దు**

VB-G RAM G కింద చేపడుతున్న పనులకు అవసరమైన స్థాయిలో కూలీలను సమీకరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని నాగలక్ష్మి ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి గ్రామీణ కూలీలకు విస్తృతంగా ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించేందుకు అధికారులు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆమె స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడితే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో ఆర్.కొత్తగూడెం గ్రామపంచాయతీ తుర్రం రవికుమార్, ఎంపీడీవో ఈదయ్య, ఎంపీవో మూర్తి, ఏపీవో సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శులు శోభారాణి, హర్షిణి, టీఏ బాలరాజు, ఎఫ్ఏ తిరుపతి, సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, VB-G RAM G సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.